
# మీరు ప్రేమించలేరు

- ఆటూరి విజయలక్ష్మి



బృంద ఉద్వేగంతో గేటువైపు చూస్తోంది. కారు హారన్ వినిపించినప్పుడల్లా ఉలిక్కిపడుతూంది.

శ్రీకాంత్! చక్కని పేరు. మనిషికూడా ఇంత చక్కని వాడా? మనసు కూడా ఇంత చక్కనిదా?

"నమస్తే"

ఆలోచనలలో వున్న బృంద ఉలిక్కిపడి తలెత్తి చూచింది. నవ్వుతున్న రెండుకళ్ళు తనవైపు చూస్తున్నాయి. ఆ కళ్ళ తాలూకు మనిషి పెదాలపై వెన్నెలలాటి చిరుహాసంతో, చేతులు జోడించి నిలబడి వున్నాడు.

"నమస్తే" ప్రతినమస్కారం చేస్తూ బరువుగా కనురెప్పలు వాల్చింది బృంద. హిప్నాటైజ్ చేస్తున్నట్టున్న అతని చూపులకు తట్టుకోలేక, ఠీవిగా, ధీమాగా తలెత్తి నడిచే బృంద తల వాల్చింది.

"రండి, కూర్చోండి."

"నే నెవరో మీరు వూహించే వుంటారనుకుంటాను" అన్నాడతను కుర్చీలో కూర్చుంటూ.

"మీరు...?" సంశయంగా అతనివంక చూచింది బృంద.

"అవును. శ్రీకాంత్ని."

"నాన్నగారు మీ కోసం వెళ్ళారు." ఆమె చెప్తూండగానే ప్రొఫెసర్ శంకర్రావుగారి కారు ఇంటి ముందాగింది.

"నాన్నగా రొచ్చారు."

"నమస్కారమండీ!"

"నమస్కారమోయ్. నువ్విక్కడి కొస్తే నేను నీ కోసం వెళ్ళాను."

"మీకు మళ్ళీ ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్ అయిందని నాన్నగారు లెటర్ రాశారు."

బృంద కాఫీ తెచ్చింది.

"మా అమ్మాయి బృంద."

"నాన్నగా రెప్పుడూ చెప్తూంటారు బృందా దేవిని గురించి."

బృంద కనుకొలకుల్లో నుండి అతనివైపు చూస్తూ కాఫీ తాగుతూంది. తన గురించి చెప్తూంటారా వాళ్ళ నాన్నగారు? ఏమని చెప్తూంటారు? చదువుల సరస్వతిననా? గాన కోయిలననా? సుందర చిత్రకారిణిననా? అవును, అలాగే పొగుడుతూ చెప్పివుంటారు. పరోక్షంగా తన గురించి విని ఆకర్షితుడై తనను చూసే అవకాశము ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ వుండివుంటాడు. ఇప్పుడు ట్రాన్స్‌ఫర్ అయి ఇక్కడకు వచ్చామని తెలియగానే చూడడానికి వచ్చి వుంటాడు. గర్వంగా ఫీలయింది బృంద.

ప్రొఫెసర్ శంకర్రావు తనకూ, శ్రీకాంత్ తండ్రి డాక్టర్ రఘుపతికీ మధ్య స్నేహలత ఎలా జనించిందో, ఎలా దినదిన ప్రవర్ధమాన మవుతూ పరిమళభరిత సుమాలతో విలసిల్లిందో శ్రీకాంత్‌కి చెప్తున్నాడు.

"ఇంక వెళ్ళి వస్తానండీ!" శ్రీకాంత్ లేచాడు.

"మేముండగా నువ్వు ఎక్కడో వుండడమేమిటోయ్! ఇంత ఇల్లుంది. నువ్వూ ఇక్కడే వుండొచ్చు మకాం ఇక్కడికి మార్చేయవోయ్!" ఉత్సాహంగా శ్రీకాంత్ వైపు చూచింది బృంద.

"అబ్బే; ఎందుకండీ! అప్పుడప్పుడూ వస్తూ వుంటానుగా?"

"మొహమాట మెందుకోయ్ మనమధ్య?"

"మొహమాటం కాదండీ! ఈ విషయంలో అభ్యంతర పెట్టకండి."

ఏ అబ్బాయీ తనలాటి అమ్మాయి సహచర్యాన్ని చేజేతులా ఒదులుకో లేడనే నమ్మకంతో వున్న బృందకు నిరాశ ఎదురయింది.

"సరే నీ ఇష్టం. ఓ పనిని బలవంతంగా చేయించడం నా కలవాటు లేదు." విసుగ్గా తండ్రి వంక చూచింది బృంద.

"పద డ్రాప్ చేసి వస్తాను."

"వస్తానండీ!"

"అప్పుడప్పుడు వస్తూ వుంటారుగా?" —'రాకేం చేస్తావన్న' అతిశయం ధ్వనించింది బృంద స్వరంలో.

"వీలునుబట్టి రావడానికి ప్రయత్నిస్తాను. మీకు నా కంపెనీ కావాలనిపించినప్పుడు ఫోన్ చెయ్యండి, వస్తాను."

ఫోన్ చెయ్యాలా? తనంతట తాను చచ్చినా చేయదలా. అతని కంపెనీ లేనిదే తనకేం గడవదా? తనకేం ఫ్రెండ్సు తక్కువా? ఆ మాటకొస్తే తన స్నేహం కోసం పడిచచ్చే అబ్బాయిలూ, అమ్మాయిలూ ఎంతోమంది వున్నారు. తను అవకాశమిస్తే తన చుట్టూ శలభాల్లా తిరిగే వాళ్ళు లెక్క లేనంతమంది. కాని... అలా అవకాశమిస్తే తన ప్రత్యేకతేముంది? తన చుట్టూ వున్న అమ్మాయిల్లో తనూ ఒకతె. తన స్నేహమంటే మాత్రం ఎందుకాసక్తి చూపుతారు?

"వస్తానుమరి" కారెక్కుతూ అన్నాడతను. మౌనంగా చెయ్యి ఊపింది బృంద.

పెద్ద పోజు వేస్తున్నాడు. రావడానికి..... ప్రయత్నిస్తాట్ట! ఇక్కడెవరో తన కోసం పడిచచ్చిపోతున్నట్టూ, తనేదో దయతలచి తనకున్న అసంఖ్యాకమైన పనుల్లో తీరిక చేసుకుని రావడానికి ప్రయత్నిస్తాట్ట! ఉద్ధరిస్తాడు! అయినా ఏదో మర్యాదకోసం వస్తూ వుండమని చెప్పింది కాని అతనొస్తే తనకేం రాక పోతే తనకేం?

అసలతను రాకుండా ఉండగలడా? రేపు సాయంత్రమో ఎల్లుండి సాయంత్రమో రాడూ? తన ఫ్రెండ్స్ అంటూ వుంటారు "బృందా! నిన్నొక్కసారి చూస్తే మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తుంది. నీతో ఒక్కసారి మాట్లాడితే జీవితాంతం నీతో మాట్లాడుతూ వుండిపోవాలనిపిస్తుంది. నీ పాట ఒక్కసారి వింటే నీ సాన్నిధ్యంలో ప్రాణాలర్పించాలనిపిస్తుంది." అలాటి తన దగ్గరకు రాకుండా వుండగలడా? వస్తాడు. తప్పకుండా వస్తాడు. రేపో ఎల్లుండో వస్తాడు.

ఎప్పటికప్పుడు రేపో ఎల్లుండో వస్తాడని బృంద అనుకుంటూ వుండగానే

రెండు నెలలు గడిచాయి. ఏరోజు కారోజు "ఈరోజు అతనొస్తాడు, తప్పకుండా వస్తాడు" అనుకుంటూ నిద్రలేచి అతనొస్తే నాకేం, రాకపోతే నాకేం? అతనికంత నిక్కు అయితే దానికి పదింతలు నిక్కుంది నాకు" అనుకుంటూ నిద్రపోయేది. సాయంత్రం ఐదు... ఆరు ఏడు గంటలు గడిచిపోతుంటే ఆకట్టుకోలేని ఉద్విగ్నత చేతిని ఫోన్ దగ్గరకు తీసుకువెళ్ళేది. ఫోన్ చేతిలోకి తీసుకోగానే ఎవరో తట్టి లేపినట్లు మేల్కొని 'ఛీ! అతనికి ఫోన్ చెయ్యడమా? ఏ కారణం లేకుండా తను ఫోన్ చేస్తే నిజంగానే తను అతని కంపెనీ కోసం తపిస్తున్నానని అపోహపడి గొప్పయిపోడూ? అతని దృష్టిలో తను తేలికయిపోదూ? ఎంత డాక్టరయితే మాత్రం తన దగ్గరకు రావడానికి కూడా తీరిక లేకుండా వున్నాడా? తీరిక లేనట్లుగా నటించడం ఓ ఫ్యాన్సీ; అయినా అతనికే ఫ్యాన్సీలుంటే తనకేం? తను మాత్రం ముందుగా అతన్ని రమ్మని పిలవదుగాక పిలువదు.'

అతన్ని రమ్మని పిలవను గాక పిలువను అని ఒట్టేసుకున్న బృంద ఆ మాటమీద నిలబడలేకపోయింది. ఓ సుందర ఉషోదయ సమయంలో ఫోన్ తీసింది.

"హలో! డాక్టర్ శ్రీకాంత్ హియర్" అని ఫోనులో వినబడగానే ఉలిక్కిపడింది బృంద.

"డాక్టర్‌గారూ! నేను బృందని."

"ఓ! బృందాదేవిగారా! శుభోదయం. ఏఁవిటిలా ఫోన్ చేశారు! నా కంపెనీ కావాలనిపించిందా?" - ప్రవాహంలా వస్తున్న అతని మాటలు చురుక్కుమనిపించాయి బృంద హృదయాన్ని. 'ఎంత అతిశయం అతనికి?' అనుకుంది. "నో! నో! ఒకరి కంపెనీ నాకు కావాలనిపించే స్థితికి రాను. ఎవరి విషయంలోనైనా సరే నా చెయ్యి పైన వుండేటట్లు చేయడానికి ప్రయత్నిస్తాను. ఐవాన్ట్ టు లివ్ ఏజ్ ఎక్వీన్ అండ్ డై ఏజ్ ఎ క్వీన్" దర్పంగా నవ్వింది బృంద. అతనికి బాగా బుద్ధి చెప్పాననుకుంది.

"సారీ మిస్ బృందాదేవీ! మీరింత ఆవేశపడతారనుకోలేదు. ఈ అందమైన ఉదయాన్నిలా పోట్లాడుకుంటూ మొదలు పెట్టడం బావుండదు. ఏమంటారు?"

ఏమంటుంది? తన నెవరన్నా అవమానించి నొప్పించాలని చూస్తే వాళ్ళ నంతకు పదింతలు అవమానించి నొప్పించడానికి ప్రయత్నిస్తుంది. కాని తనతో మంచిగా వుండేవాళ్ళతో తను మరింత మంచిగా వుండగలదు. తనకు సన్నిహితంగా వుండే వారికి ప్రాణం పెట్టడానికి కూడ వెనుదీయదుతను.

"సారీ డాక్టర్! నా ఆవేశానికి సిగ్గుపడుతున్నాను. ఈరోజు నాబర్త్‌డే, ఫ్రెండ్స్‌కి చిన్న పార్టీ ఇస్తున్నాను. సాయంత్రం ఇంటికి రండి."

"తప్పక వస్తాను."

"మరుంటా నండీ! ఇంకా ఫ్రెండ్స్‌ని పిలవాలి. సాయంత్రం మీకోసం ఎదురు చూస్తాను." అతని జవాబు కోసం ఎదురుచూడకుండానే ఫోన్ పెట్టేసింది. అప్పుడనిపించింది అతను శుభాకాంక్షలన్నా అందజేయలేదని. బలవంతాన ఆ ఆలోచనని మనసులో నుండి తోసివేసింది.

సాయంత్రం అందంగా అలంకరించుకుని మిత్రులందరినీ ఆహ్వానిస్తోంది బృంద. ఒక్కొక్కరూ వస్తున్నకొద్దీ ఏదో ఆరాటం, ఆవేదన అధికం కాసాగాయి. శ్రీకాంత్ రాలేదు. ఇతనేమిటి? ఇంకా రాలేదు? రాకపోతే రానని చెప్పకూడదూ? వస్తానని చెప్పి రాకపోవడమెందుకు?

"ఎవరికోసం భామా ఈ నిరీక్షణ? ఏ రాకుమారుని కోసం ఎన్నడూలేని ఈ అలంకరణ?" బృంద సన్నిహిత మిత్రురాలు శార్వాణి అడిగింది. నవ్వి వూరుకుంది బృంద.

"మనలో మనమాట, ఏచేపన్నా నీ గాలంలో చిక్కుకుందా? లేక ఎవరి గాలంలోనన్నా నువ్వే చిక్కుకున్నావా?"

"నీకు తెలుసుగా వాణీ గాలం వెయ్యడం, చేపలతో చెలగాటాలాడడమంటే నా కసహ్యం అని. నేను ఎవరి గాలంలోనన్నా చిక్కుకోవడమన్నది కూడ అసంభవమని నువ్వెరుగుదువు."

"పోనీయ్! ఇంకెవరన్నా రావాలా? లేక అంతా వచ్చినట్లేనా."

"లేదు.... ఊహుఁ అంతా వచ్చేశారు. పద పైకిపోదాం." నిస్పృహ, నిరాశ ఆమె నావరించాయి. ఎవరో ఆమెలోని శక్తిని, ఉత్సాహాన్ని చంపేసినట్లు ఫీలయింది.

ఫ్రెండ్స్‌కోసం లేని నవ్వును తెచ్చి పెట్టుకుని పార్టీ అయ్యేవరకు కూర్చుంది బృంద. అంతా పిక్చర్‌కి పోదాం అన్నారు.

"సారీ! నాకు తలనొప్పిగా వుంది. ఈ రోజు రాలేను. మరెప్పుడైనా వెళ్దాం."

ఎలాగైనా వాళ్ళను తప్పించుకొని ఒంటరిగా వుండాలి. వాళ్ళతో కలిసి వుంటే హృదయంలోని అశాంతి మరీ ఎక్కువయేలా వుంది.

"సరే మేం పోయొస్తాం, రెస్టు తీసుకో." వెళ్ళిపోయారంతా. వాళ్ళు తెచ్చిన విలువైన బహుమతుల ముందు సర్వం కోల్పోయినదానిలా కూర్చుంది.

"నమస్తే" కోటి వీణ లొక్కసారి మీటినట్లయింది.

"నమస్తే, రండి రండి మీరింక రారనుకున్నాను" తనలోని అలజడిని దాచుకోవడానికి ప్రయత్నిస్తూ సాదరంగా ఆహ్వానించిందతన్ని.

"వెరీ సారీ! చాలా లేట్ చేశాను కదూ! ఓ అర్జంట్ కేస్ రావడంవల్ల రాలేకపోయాను. ఇప్పుడుకూడా చాలా అలసటగా వుంది. మీకు వస్తానని మాటివ్వడం వల్ల వచ్చాను." అతని ముఖాన్ని పరిశీలనగా చూచింది బృంద. పీక్కుపోయిన ముఖం, బరువుగా వాలిపోతున్న కనురెప్పలు. అనిర్వచనీయమైన అనుభూతితో ఆర్ద్రమైంది బృంద హృదయం.

"పైకి వెళ్దాం పదండి, చల్లటి గాలి తగిలితే కొంచం అలసట తీరుతుంది."

"పదండి" ఆమె ననుసరించాడతను.

జారిపోయిన పయ్యెటను సవరించుకోవడంలో ఉంగరపు రాయి తళుక్కుమంది. శార్వాణి తెచ్చింది తన బర్త్‌డే ప్రెజెంటేషన్‌గా. ఇతనేం తెచ్చి వుంటాడు? శుభాకాంక్షలు కూడా తెలుపని వాడు ప్రెజెంటేషను తెస్తాడా?..... ఛ! ఛ! తనింత హీనంగా ఆలోచిస్తూందేమి.

"హలో! రావోయ్ రా! మళ్ళీ రానేలేదు" పైన కూర్చున్న ప్రొఫెసర్ శంకర్రావు.

"ఏవో పనులు, తీరిక లేక రాలేకపోయానండీ!"

రాజకీయాలనుండి సాహిత్యం వరకు అన్నిటిని గురించి సంభాషిస్తూ భోజనం ముగించారు శ్రీకాంత్, బృంద, ఆమె తల్లిదండ్రులు.

"ఇంక అమ్మాయి ఓ పాటపాడి వినిపిస్తుందోయ్" అన్నారు శంకర్రావు. చిరునవ్వుతో బృందవైపు చూస్తూ కూర్చున్నాడు శ్రీకాంత్.

"ఇప్పుడేం పాటలెండి నాన్నగారూ!" అంది బృంద. శ్రీకాంత్ తనను పాడమని బలవంతపెడతాడని ఆశించింది. అలాంటిదేం లేకుండా మౌనంగా కూర్చున్నాడు శ్రీకాంత్.

మాట్లాడితే నోటిముత్యాలు రాలిపోతాయి కాబోలు అయ్యగారు మౌనవ్రతం పట్టారు! మర్యాదకోసమైనా పాడమని అడగడేం? పాట అంటే కూడా



ఇది నేను రాసిన రెండవ కథ. తొలి కథ అచ్చులో 50 పేజీలు వస్తుంది. అందుకే 1965లో 'జయశ్రీ' మాస పత్రికలో ప్రచురింపబడిన నా రెండవ కథ పంపుతున్నాను.

-ఆలూరి విజయలక్ష్మి

ఇష్టం లేనంత విరసుడా? లేక...... ఇదీ ఓ పోజా?

ఐనా చూద్దాం! తన పాట విన్న తరువాత ముగ్ధుడవకుండా ఎలా వుండ గలడో! అద్భుతంగా పాడి అతనితో "శభాష్" అనిపించుకోకపోతే ఇంకెందుకు?

"తా విరహీ దీనా!" ఆమెకే అద్భుతం అనిపించేలా పాడింది.

"చాలా బాగా పాడావమ్మా" అన్నారు శంకర్రావు. తల్లి ప్రేమగా కూతురి తల నిమిరింది.

కాని, ఎవరి మెప్పుకోసం తన శక్తులన్నిటినీ కూడ దీసుకుని ఇంత అద్భుతంగా పాడిందో, అతనుమాత్రం గడ్డానికి చేతి నానించి క్రిందకు చూస్తూ కూర్చున్నవాడు కూర్చునట్లే వున్నాడు. ఇతను పాషాణమాయేం, ఏ అనుభూతులూ లేకుండా వుండటానికి! ఒక్కమాట. ఒక్కసారి 'బావుంది' అంటే తన కెంత సంతృప్తిగా వుంటుంది. ఓహ్! పోనియ్! ఇతను మెచ్చుకోకపోతే తన కేమిటట లోటు? ఇతని కంటే గొప్పవాళ్ళు చాలామంది ఎన్నదో ప్రశంసించారు తనను. ఇలాంటి వాళ్ళు మెచ్చుకోకపోతే తనకేం తక్కువ కాదు.... ఏం లేదు..... తనకేం నష్టంలేదు..... కాని హృదిలోని వెలితిని పూడ్చుకోవడం బృందకు సాధ్యమవలా.

అదిగో ఇప్పుడే నిద్రలోనుండి మేల్కొంటున్నట్లు కను రెప్పల్ని ఎత్తుతున్నాడు. ఆ కళ్ళలోని భావమేమిటో? అంతులేని తన్మయత్వమా? అననుభూతమైన వేదనా? మాటల కతీతమైన ప్రశంసా? అంతే. ఒక్కక్షణం. ఒక్క క్షణం మాత్రం తన చూపుతో కలిసి మెరిసి మాయమయిందా భావం. మరుక్షణం అతని అధరాల్ని వీడని నవ్వు తొంగిచూచింది.

"మరింక నేను సెలవు తీసుకుంటానండీ!" లేచాడతను.

"ఓహ్! పదయిందే! నే డ్రాప్ చేస్తాను పదవోయ్. సుశీ! కారు కీస్ తీసుకురా!"

బృంద, శ్రీకాంత్ మిగిలారు. బృంద ముఖం వైపు ఓ క్షణం చూస్తూ కూర్చున్నాడు శ్రీకాంత్.

"బృందాదేవీ!"

"ఊఁ" ఏదో స్వప్నంలో ఉన్నట్లుగా పలికింది బృంద.

"ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?"

"ఏం లేదు. ఈ వెన్నెల రేఖల్ని పట్టుకుని జీవన యానాన్ని పూర్తి చెయ్యాలనిపిస్తూంది" మత్తుగా పలికింది బృంద.



"మీరు భావుకులు బృందాదేవీ!" సన్నగా నవ్వాడతను.

"ఒక్క విషయం బృందాదేవీ! మీరేదో అసంతృప్తిగా వున్నట్లనిపిస్తూంది. నేను చెప్పేది ఎంతవరకు మీ అసంతృప్తిని పోగొట్టగలదో లేదో తెలియదు. అయినా చెప్పి వెళ్ళడం నాకర్తవ్య మనుకుంటాను.

"పుట్టిన రోజని చెప్పి ఆహ్వానించినా నేను శుభాకాంక్షలు కూడా తెలుపక పోవడం, మీ మిత్ర వర్గమంతా విలువైన బహుమతులు తెచ్చిస్తే నేను ఒట్టి చేతులతో రావడం, ఎంతో హాయిగా పాట పాడినా ప్రశంసా పూర్వకంగా మాటాడపోవడం, బహుశా మీకు కోపాన్ని, అసంతృప్తిని కలిగించాయనుకుంటాను." అతని వంక ఆశ్చర్యంగా చూచింది బృంద. వెంటనే అతని మాటల్ని ఒప్పుకొని పూరుకోవడానికి అహం అడ్డొచ్చింది.

"మీకెలా తెలుసు?"

"ఇది ఊహ మాత్రమే బృందాదేవీ! ఇది నిజము అవనూవచ్చు. కాక పోనూ వచ్చు" వాదనకోసం వాదించకుండా మౌనంగా వుండిపోయింది బృంద.

"కొన్ని విషయాల మీద నాకు కొన్ని స్థిరమైన అభిప్రాయాలున్నాయి బృందాదేవీ! వాటికి భిన్నంగా ఏ పరిస్థితుల్లోనూ పోవడం నాకిష్టం వుండదు" ఆగాడతను. ఆమె తన మాటల్ని ఖండిస్తూ మాటాడుతుందేమోనని ఆమె వంక చూచాడు.

"ఈ లోకంలో పుట్టడం, చావడం అనేవి చాలా సహజమైన విషయాలు. అంత సహజమైన విషయాన్నింత ఆడంబరంగా జరపడం ఇష్టం వుండదు నాకు. మనం పండుగ చేసుకోవలసింది మనం పుట్టినరోజు కాదు. మనం మనస్ఫూర్తిగా ఓ మంచిపని చేసిననాడు. ఇంక శుభాకాంక్షలంటారా ఓ మిత్రుడిగా సదా మీ శుభాన్ని కోరుతూనే వుంటాను. దాన్ని ప్రత్యేకంగా ఈ రోజు డబ్బాకొడుతూ చెప్పనవసరం లేదనుకుంటాను." ఆగాడతను ఆమెలోని భావాలు చదవడానికి ప్రయత్నిస్తూ.

"చెప్పండి" కుతూహలంగా అతని వంక చూచింది బృంద.

"బహుమతులు! - ఓ మనిషిని కట్టివేసుకోడానికుపయోగించే కృతక సాధనాలు. వీటి నివ్వడంలో ఆప్యాయతకంటే తమ తమ సిరిసంపదల్ని వెలిబుచ్చాలనే తహ తహ లేక మర్యాదకోసం అప్పో సప్పో చేసి ఘనంగా కొని తీసుకురావాలన్న తపన ఎక్కువ. ఇవంటే నాకంత మంచి అభిప్రాయం లేదు బృందాదేవీ!"

బృంద హృదయంలో శ్రీకాంత్ ఎన్నో మెట్లు చర చరా ఎక్కేశాడు.

"మరి నా పాట....."

"ఆగండి చెప్తాను." అర్థోక్తిలోనే అందుకున్నాడు శ్రీకాంత్.

"ఇందులో పూర్తిగా నా స్వార్థం బృందాదేవీ! నాలో ఓ మధురమైన వ్యథ రేగినప్పుడు దాన్ని భాషలో వెలిబుచ్చేసి ఆ అనుభూతిని కోల్పోలేను. ఆ వ్యథ బరువు తగ్గిపోకుండా హృదిలో నిలుపుకోవడానికి ప్రయత్నిస్తా! ఈ స్వార్థం కాకుండా మరో అభిప్రాయంకూడా వుందనుకోండి. మనలో వున్న ఓ దుర్గుణం - మనకు తెలిసిన విశేషణాలన్నిటి తోనూ ఓ నిజమైన కళాకారుణ్ణి పొగిడేసి అతన్ని అహంకారిగానూ, యుక్తాయుక్త విచక్షణాశూన్యుని గాను చెయ్యడం - అతన్నేదో ప్రోత్సాహపరుస్తున్నామనుకుని అతనికి తెలియకుండా అతనికోసం ఓ పెద్ద గోతిని త్రవ్వడ మన్నమాట." నవ్వాడు శ్రీకాంత్.

"పోనివ్వండి మీకు బోర్ కొడుతుందిలా వుంది. నేను వెళ్తానింక. నావల్ల మీకు ఏ విధంగానైనా బాధ కలిగుంటే క్షమించండి." మెట్లు దిగుతూ అన్నాడతను.

"నో నో! అదేం లేదు. నా ముందేదో క్రొత్త ద్వారాలు తెరుచుకున్నట్లనిపించింది" అంది బృంద అతని వెనుక దిగుతూ.

చకచకా మెట్లు దిగుతున్న వాడల్లా చటుక్కున వెనక్కు తిరిగాడు. "మిత్రునిగా నా హృదయపూర్వకమైన సలహా బృందాదేవీ! మీరింత భావుకులుగా వుంటే ఎప్పుడో ఒకప్పుడు గట్టి దెబ్బతింటారు. ప్రతివిషయాన్నింత గాఢంగా తీసుకో గూడదు. కొన్ని కొన్ని విషయాల్ని తేలిగ్గా తీసుకొని సుఖాన్ని, సంతోషాన్ని వెతుక్కోకపోతే బ్రతకలేం."

వెళ్ళిపోయాడతను. కాని..... అతని మాటలింకా చెవుల్లో గింగురు మంటున్నాయి. అతని మాటలు విన్న తరువాత వయసుకంటే ఎన్నో రెట్లు మానసికంగా ఎదిగిపోయాననుకున్న తను, ఎన్నో విషయాలు తెలుసునన్న ధీమాలో వున్న తను మానసికంగా ఇంకా ఎంత ఎదగాలో, తనకు తెలిసిం దెంత స్వల్పాతి స్వల్పమో ఊహించుకుని విస్తుపోయింది.

❀ ❀ ❀ ❀ ❀

"శ్రీకాంత్ నీకు తగినవరుడని నాకూ, మీ అమ్మకూ అన్పించిందమ్మా. నీకు ఇష్టమయితే అతని అభిప్రాయం కూడా కనుక్కొని వాళ్ళ తల్లిదండ్రులతో మాట్లాడుతా!" అని తండ్రి తనతో అన్నప్పుడు ఒక్కసారి నిస్తబ్ధమైంది బృంద హృదయం. ఆనందం, శంక, భయం అన్నీ కలగా పులగమయాయి. అంటే ఆమె ఊహల్లోకే విషయం రాలేదని కాదు. అతన్ని తన జీవిత భాగస్వామిగా నిలబెట్టుకుని చాలా చాలా విధాలుగా ఊహించుకుంది. కాని తన ఊహలు తన ప్రమేయం లేకుండానే కార్య రూపంలోకి రావడం ఆమె కానందాన్ని కలిగించింది.

తన భర్తలో కొన్ని గుణాలుండాలని బృంద కోరిక. సమాజం దృష్టిలో తప్పొప్పుల గీటురాయి ఏదైనా కానీయ్. తన భర్త వ్యభిచారీ, త్రాగుబోతూ అయితే భరించలేదు బృంద. ఈ గుణాలనన్నా సహిస్తుంది కాని అతను వంచకుడు, అబద్ధాలకోరూ అయితే అసలు భరించలేదు. తనకు కావలసిన నిజాయితీ శ్రీకాంత్‌లో వుందా అని ఆలోచించింది బృంద. ఇన్నాళ్ళ పరిచయంలో ఇంత నిజాయితీ పరులుండడం అరుదయిన ఈ కాలంలో అన్ని

విధాలా వున్నతుడయిన అతన్ని చేసుకోవడానికి ఆక్షేపణ యేమిటి?

"అమ్మకు, మీకు ఇష్టమయితే నా అభ్యంతరం లేదు నాన్నగారూ!" అంది బృంద.

శంకర్రావ్ ప్రస్తావనను శ్రీకాంత్ దగ్గర తెచ్చారు.


"బృందాదేవి అభిప్రాయాన్ని కనుక్కున్నారా?"

"కనుక్కున్నానోయ్, అమ్మాయికిష్టమే. నీ అభిప్రాయమే కావలసింది."

"ఓ క్షణం ఆలోచిస్తూ వుండిపోయాడు శ్రీకాంత్.

"క్షమించండి, నాకంతగా ఇష్టంలేదు. మా ఇద్దరివీ భిన్న మనస్తత్వాలు, నా సాంగత్యం వల్ల బృందాదేవి సుఖపడుతుందనుకోను. ఆమెని మరోసారి ఆలోచించి చూడమనండి."

శ్రీకాంత్ ఇలా అన్నాడని వినగానే కోపంతో దహించుకుపోయింది బృంద. తనలో ఇతరులలో లేని ఆధిక్యత ఏదో వుందనుకొనే ఆమె అహం దెబ్బతింది. అసలు తను అతనిని చేసుకుంటాననటమే గొప్ప. తను చేసుకుంటానంటే అతను తిరస్కరిస్తాడా? తనలో ఏం లోపముందని? అసలు అతనికింత అతిశయం ఏమిటి? తను అతన్నే చేసుకుంటానంటూ, నువ్వుతప్ప నాకు వేరే దిక్కులేదోయ్ మహానుభావా అని దేవురిస్తాననుకున్నాడా? బృంద శ్రీకాంత్‌ని చేసుకుంటానంటే అతను నిరాకరించాడని ఎవరికైనా తెలిస్తే తనకెంత అవమానం? మళ్ళీ నలుగురిలో తను తలెత్తుకు తిరగ్గలదా? ఇతను తప్పితే లోకంలో యువకులే లేరా పెళ్లాడడానికి? ఈ మాత్రం సద్గుణవంతులు దొరక్కపోరు. అదృష్టం తిన్నగా వుంటే సరి పక్కారోగని చేసుకున్నా అతను మంచి మార్గంలోకి వచ్చి సుఖపడొచ్చు. అంచేత ఇతన్నే ప్రతిమాలాడాల్సిన ఖర్మ తనకేమీ లేదు. ఐనా ఈ విషయాన్నింత సీరియస్‌గా తీసుకుని బుఱ్ఱ బ్రద్దలు కొట్టుకోవడమేం బాగోలా! దీన్నిక్కడే తుంచేసి మరిచిపోతేసరి.



ఊహు! ఏమైనాసరే అతన్నే చేసుకోవాలి. అతను చేసుకోనన్నందుకు పట్టుదలకోసమైనా అతని జీవితంలో ప్రవేశించాలి. తన విలువేమిటో అతను గుర్తించేలా చేయాలి. అతనలా అనగానే తనింత హైరాన పడిపోతోంది. కాని అతనికి తనను చేసుకోవడం ఇష్టమేనేమో! అతనితో తను సుఖపడలేదేమోనని అపోహపడి తనకు మళ్ళీ ఓసారి ఆలోచించుకోవడానికి అవకాశమిచ్చి వుంటాడు. ఆ మాత్రం సంస్కారం, ఔన్నత్యం మాత్రం ఎంతమంది కుంటాయి? తాము సుఖపడతారా లేదా అని ఆలోచిస్తారుగాని ఎదుటి వారిని గురించి ఆలోచిస్తారా! అంతటి సహృదయుణ్ణి ఏవిధంగానైనా చేసేసుకోవాలి.

"సుఖానికి నిర్వచనం, పరిమితి ఏమిటి నాన్నగారూ? అతన్నా అనుమానాలు పెట్టుకోవద్దని చెప్పండి. మీరు వాళ్ళ తల్లిదండ్రులతో మాట్లాడండి" అంది బృంద.

ఫలితం మరో నెల రోజుల్లో బృంద శ్రీకాంత్‌ల వివాహం జరిగింది. కలలు, కాంతులు నింపుకున్న ఆమె కళ్ళల్లో తన ప్రతిబింబాన్ని చూచుకున్నాడు శ్రీకాంత్. ఆశలతో, ఆశయాలతో వణికే తన చేతిని అతని చేతిలో వుంచింది బృంద.

జీవితం పర్వడించిన విస్తరిలా అనిపించింది బృందకు. మానవ జీవితపు పరిమితులు తక్కువ. ఈ స్వల్ప కాలంలో అందిన అనుభవాలన్నిటిని చేజిక్కించుకోవాలి. ఒక్క నిమిషం వృధాపోనీయకుండా సాధించదలచిన విలువల కోసం వెచ్చించాలి - అనుకుంది బృంద.

"నాలో ఏం చూసి పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకొన్నారు మీరు?" బృందకు అంత ఆనందంలోనూ ఏదో ఓ మూల విషపురుగులా తొలుస్తున్న అనుమానం. చిరునవ్వే సమాధానంగా పడుకున్నాడు శ్రీకాంత్. తను పరచిన తెల్ల దుప్పటిలాటి వెన్నెలలో శ్రీకాంత్ మీదకు వంగి అతని క్రాఫ్ చెరుపుతోంది బృంద.

"మిమ్మల్నే" రెట్టించింది బృంద.

"నేనూ అదే ప్రశ్న అడిగితే?"

"వెంటనే జవాబిస్తాను. మొదట మీరు తిరస్కరించినప్పుడు కోపంతో, పంతానికి మిమ్మల్నే చేసుకుంటానని పట్టుబట్టాను. కాని తరువాత తెలిసింది నాకు తెలియకుండానే నా హృదిలోని సున్నిత స్థలంలో మీరు చోటు చేసుకున్నారని" విచ్చుకుంటున్న మల్లెమొగ్గలా నవ్వింది బృంద.

"మరి మీ జవాబు చెప్పండి." ఓ క్షణం ఆలోచిస్తూ వుండిపోయాడతను. అతని జీవితంలో తన స్థానం అపురూపమైనదని తనలోని ప్రత్యేకతల్ని, ప్రతిభను చూసి ఆకర్షితుడయాడని అతను చెప్తాడని ఊహాగానం చేస్తూంది బృంద.

"అసలిలాటి సంభాషణ రావాల్సిందికాదు మన మధ్య" ఆగాడు శ్రీకాంత్.

"కాదు. నాకు జవాబు చెప్పితీరాలి మీరు" పట్టుదలగా అంది బృంద.

"నిజం కావాలా? నీకు ఆనందం కలిగించే జవాబు కావాలా?"

"నాకు నిజం కావాలి. ఐ వాన్ట్ ది ట్రూత్" అసహనంగా జవాబిచ్చింది బృంద నిటారుగా కూర్చుంటూ.

"నిన్ను నేను చేసుకోవడం వల్ల నువ్వూ, మీ అమ్మా నాన్నగారూ, మా అమ్మా నాన్నగారూ అంతా సంతోషించారు. మీ అందరి సంతోషం కోసం చేసుకున్నాను." దెబ్బతిన్నట్లు చూసింది బృంధ.

"మీ కిష్టం లేకుండా ఎందుకు చేసుకున్నారు? మీ కిష్టం లేనపుడు మా సంతోషాల్నింతగా లెఖ్ఖ చేయవలసింది కాదు. మీ కెవరిమీద ఇష్టం, ఇష్టాన్ని మించిన ప్రేమ వున్నాయో 'ఆమె'నే చేసుకోవాల్సింది." అంది బృంద 'ప్రేమ' అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ.

"నాలో తేలిగ్గా హృదయాన్ని పారేసుకోగల శక్తిలేదు బృందా! అలా పారేసుకోగల బలహీన క్షణమే వస్తే ఎవరి సంతోషాల కోసం, నువ్వు అపోహ పడుతున్న 'ఆమె'ను వదులుకుని వుండేవాణ్ణి కాను." బృందలోని వేడి కొంచెం తగ్గింది.

"నా భార్య స్థానంలో ఎవరున్నా సరే ఒకే ఆదరణ, గౌరవం ఇస్తానామెకు. ఇంక ఈ విషయాన్నింతటితో తృంచేద్దాం బృందా! ఇలాటి సంభాషణలు మన మధ్య రావడమంత ఆరోగ్యకరం కాదు. ఒక్కొక్కప్పుడు నిజానికి సర్వనాశనం చేసే శక్తి వుంటుంది." అన్నాడతను ఆమె పయిటి అంచు జరీని వేలితో రాస్తూ.

అంతేనా? తనమీద ప్రత్యేకాభిమానం ఏమీలేదా! ఆయన భార్య స్థానంలో మరెవరికైనా లభించే ఆదరణ, గౌరవమేనా తనకూ లభించేది?! అవీ.... ఒట్టి ఆదరణ... గౌరవమూ - బృంద అహం పూర్తిగా దెబ్బతింది.

కాని ఇదేమిటి? తనకు రావలసినంత కోపం రావడం లేదేం? తనకు తెలియకుండానే ఆయన నిజాయితీని చూసి సంతోషిస్తూందా! అవును. కల్లబొల్లి కబుర్లాడి తనను ప్రేమిస్తున్నట్లు నమ్మించడం చాలా తేలిక. అలా చేయకుండా ఎంత వున్నతులైతే తనతో నిజం చెప్తారు? ఇప్పుడు ప్రేమించకపోతేనేం! అతి త్వరలోనే ఆయన హృదయం అనురాగంతో స్పందిస్తుంది. ఈ విషయానికే మరీ మూర్ఖురాలిలా బాధపడటం బాగోలా - బలవంతాన ఆలోచనలని మనసులో నుండి చెరిపేసుకోవడానికి ప్రయత్నించింది బృంద. "చలిగాలి వేస్తూంది. పదండి లోపలికి పోదాం" అంది బృంద అతని చెయ్యిపుచ్చుకొని లేవదీస్తూ. తన చేతిని పట్టుకున్న ఆమె చేతిని పెదవులతో సున్నితంగా తాకాడతను.

✻ ✻ ✻ ✻ ✻

రోజులు గడుస్తున్న కొద్దీ బృందలోని అసంతృప్తి ఎక్కువయిపోతూంది. రోజు రోజుకూ ఆమెలోని ఉత్సాహం సన్నగిల్లి విషజ్వరం చేత పీడింపబడిన దానిలా అయిపోతూంది. జీవితంలో అందాలు, సుఖాలు, సంతోషాలు ఎన్నో వున్నాయని నమ్మి వాటి కోసం ఆరాటపడే బృందకు జీవితం మీద ఓ విధమైన నిర్లిప్తత ఏర్పడిపోతూంది.

తమ దాంపత్య జీవితాన్ని కళాత్మకంగా గడపాలని, తామిరువురు ఒకరి కోసం ఒకరు పుట్టినట్లుగా, చూచే వారికి ఈర్ష్య కలిగించేంత హాయిగా గడ

పాలని, సుఖానికి నిర్వచనం తామే అన్నట్లు జీవించాలని, తన గృహాన్ని స్వర్గతుల్యంగా చేసుకోవాలని.... ఓహ్ !...... ఎన్ని కలలు కనేది తను!! ఎన్ని ఊహాసుమాల మధ్య పరవశించిపోయేది తను!!

జీవితమంటే చీరలు కొనడం, పిక్చర్లు చూడడం, పిల్లల్ని కనడం కాక జీవితానికి కొన్ని విలువల్ని ఆపాదించుకుని బ్రతకాలనుకుంది తను. కానీ.... చిన్న చిన్న విషయాల్లోనే తను బాధపడిపోతూంది. తను అనుకొన్న దానికి కొంచెం భిన్నంగా జరిగితే వ్యథపడిపోతూంది. చికాకుపడిపోతూంది. ఆయనకు చికాకు కలిగిస్తూంది.

"పెళ్ళవగానే హనీమూన్ ట్రిప్పేసి జాలీ జాలీగా గడపకపోతే జీవితమేమిటోయ్" - అనేది తను. ఆగ్రా, కాశ్మీర్ లాంటి ప్రదేశాల అందాల్లో తమ ఆనందాల్ని లీనం చేసుకోవాలనుకునేది. కాని 'హనీమూన్' అన్న పదాన్ని కూడా మరచిపోవలసి వచ్చింది. ఆయన నుండి ఆ ప్రస్తావనను ఆశించిన తనకు ఆయన ఆ మాటేమిటో తెలియనట్లు ఊరుకోవడం ఆశాభంగం కలిగించింది. తనంతట తానా ప్రస్తావన తీసుకురావడానికి అభిమానం అడ్డొచ్చింది. ఇలాటి విషయాల్లో ఆయన ఇనీషియేషన్ తీసుకోవాలి కాని తను తీసుకోవడమంతగా మనస్కరించదు.

"హనీమూన్‌కి వెళ్ళకపోతే జీవితాన్ననుభవించడం తెలీని వాళ్ళనీ, లేకపోతే పీనాసి వాళ్ళనీ విమర్శించే దానివే, నువ్వెందుకెళ్ళలేదే బృందా?" అడగనే అడిగిందో ఫ్రెండ్. గతుక్కుమంది తను.

"ఆయనకు సెలవు దొరకలేదే" నీరసంగా ఓ అబద్ధ మాడేసి తప్పించుకుంది. కాని నమ్మనట్లు తనవంక చూచి జాలిగా నవ్విందామె.

తన బలవంతం మీద ఓరోజు షాపింగ్‌కు వచ్చారాయన.



"ఆమె కట్టుకున్న చీర చాలా చక్కగా వుందికదూ!" అన్నారాయన నల్లటి డిజైనుతో వున్న తెల్లటి చీరను చూపిస్తూ. ఆ చీరకంటే చీర కట్టుకున్నామె ఆకర్షించింది తనను. జెలసీ సూదిమొనలా గ్రుచ్చుకుంది తనను.

"అవును క్రొత్త డిజైన్స్ వచ్చాయి" అంది తను ముభావంగా...

"చాలా అందంగా వుంది." అన్నారు డ్రెస్ మీద కామెంట్ చేయడం ఎరుగని ఆయన.

ఆయననంతగా ఆకర్షించిన అలాంటి చీరను తనకోసం కొని తీసుకువస్తారని చాలా రోజులు ఎదురుచూచింది తను. అలాంటి సూచన లేమీ లేకపోవడంతో వద్దువద్దనుకుంటూనే ఉండబట్టలేక తనే అడిగిందతన్ని.

"ఆ రోజు తెల్లచీరె నచ్చిందన్నారుగా! మరి తీసుకు రాలేదేం?"

"నువ్వుగాని తీసుకురమ్మని చెప్పావా?" విస్మయంగా అడిగారాయన.

"దానిక్కూడా నేను చెప్పాలా? భార్యకు తనకు నచ్చిన చీర తీసుకురమ్మని కూడా మరొకరు చెప్పాలి కాబోలు" విసురుగా అంది తను.

"అది కాదు బృందా! నువ్వారోజు ముభావంగా "ఔను" అన్నావు. నీ ధోరణి చూస్తే అది నీకంతగా నచ్చలేదనిపించింది. నాకు నచ్చినంత మాత్రాన తెచ్చి నీచేత బలవంతంగా కట్టించడం ఇష్టం లేకపోయింది." నెమ్మదిగా జవాబిచ్చారాయన.

"ఏం? బలవంతాన కట్టిస్తే ఏం ముంచుకుపోయింది?"

"నీ ఇష్టాలకు అడ్డుచెప్పలేను బృందా! నా అభిరుచులకోసమని నీ స్వేచ్ఛను చంపలేను."

"స్వేచ్ఛ! స్వేచ్ఛ! ఎవరికి కావాలి స్వేచ్ఛ! సరదా, సంతోషంలేని ఈ స్వేచ్ఛనేం చేసుకోన్నేను. ఉఁ హుఁ అలాటి స్వేచ్ఛను కోరన్నేను." కోపం, కన్నీళ్ళ రూపంలోకి కరిగివచ్చింది తనకు.

చీరలకు మొహం వాచికాదు. ఆయనంతట ఆయన తనకేదైనా తెస్తే తనకెంత సంతోషంగా వుంటుంది! అది ఆయనకెలా తెలుస్తుంది. ఆ మంచితనం, ఆదర్శాలు అంటూ వాటిని పట్టుకుని ప్రాకులాడడం తప్పితే.

గంభీరస్తుల్ని గౌరవించగలదేగాని ప్రేమించలేదు తను. తన భర్తలో నిండుగా చిలిపితనం వుండాలని, ఆయన ప్రతిమాట, ప్రతిచేత తనకు అనుక్షణం గుర్తుకువచ్చి పులకరింప చేసేలా వుండాలని ఆశించింది తను. చల్లని సాయం సమయాల్లో జంటగా కబుర్లు చెప్పుకుంటూ షికారుకు వెళ్ళాలనిపిస్తుంది తనకు. తమ ఇంటిముందు పూబాలల మధ్య కుర్చీ వేసుక్కూర్చుని ఏదో ఒకటి చదువుతూ కూర్చుంటారాయన. నవలలన్నా, సాహిత్యమన్నా పెద్దగా అభిరుచిలేని తనకు ఆయతో పాటు ఓ పుస్తకం తీసుకు కూర్చోవడం మహా కష్టంగా వున్నా, ఆయనతో చెప్పడానికి జంకేది. ఇన్నాళ్ళ నుండి కలిసి బ్రతుకుతున్నా తను హృదయం విప్పి మాట్లాడగలిగే చనువు నివ్వని ఆయన గంభీరతని అసహ్యించుకునే స్థితికి వచ్చింది తను!

ఒకసారి పాటకచేరి జరుగుతుంటే ధైర్యంచేసి వెళ్దామంది తను. సరేనని బయలుదేరేరాయన. వెళ్ళి ఓ అరగంటయిందో లేదో ఓ కుర్రాడు వచ్చి ఆయనను బయటకు తీసుకెళ్లాడు. ఓ రెండు నిమిషాలలో తిరిగివచ్చారాయన.

"నేనర్జంటుగా ఓ చోటకు వెళ్లాలి బృందా! కారు పంపిస్తాను. పాట కచేరి అయిపోగానే వచ్చేయి. వివరాలు ఇంటికి వచ్చాక చెప్తాను" అంటూనే వెళ్ళిపోయారాయన.

తనని ఘోరంగా అవమానించినట్లు బాధపడింది తను. ఆయన వెళ్లి ఐదునిమిషాలు కూడా కాకముందే ఇంక అక్కడ కూర్చోబుద్ధవక రిక్షాలో ఇంటికి వచ్చేసింది. బాధతో, కోపంతో ఉడికిపోతూంది తను.

రాత్రి పదిగంటలు దాటిన తరువాత తిరిగి వచ్చారాయన, ఆయన వచ్చింది గమనించనట్లు పుస్తకంలో తల దూర్చింది తను.

"కోపం వచ్చిందా బృందా!" అన్నారాయన తన భుజం చుట్టూ చేతులు వేస్తూ. విసురుగా ఆయన చేతుల్ని త్రోసేసింది తను.

"నాకు కోపం వస్తే మీకేమిటట లెక్క!"

"నేను చెప్పేది శాంతంగా విను బృందా!"

"బ్రతుకంతా వినడం, ఆలోచించడం, నిగ్రహించుకోవడంతోనే సరిపోతూంది. మంచితనం పేరు మీదుగా మన జీవితంలో ఎన్ని విలువైన అంశాల్ని కోల్పోతున్నామో మీరు గుర్తించగలరా!"

"అదికాదు బృందా? హరి ఊళ్ళో లేడు. అతని భార్యకు నెలలు నిండక ముందే నొప్పులొచ్చాయి. ఈ ఊరు క్రొత్తగా వచ్చారుకదా! మనకంటే తెలిసిన వాళ్ళెవరూ లేక మనయింటికి కబురు పంపించిందట. అంత అవసరంలో మనకోసం పంపిస్తే వెళ్ళకపోతే ఏం బావుంటుంది చెప్పు? నీతో చెప్పి నిన్ను కూడ తీసుకువెళ్దామనుకున్నాను. కాని అంత సరదాపడి వచ్చిన నిన్ను డిస్టర్బ్ చేయడం ఇష్టంలేక ఒక్కణ్ని వెళ్ళాను. ఆమెను నర్సింగ్ హోమ్‌లో చేర్పించి, పిల్లలకి హోటల్ భోజనం పెట్టించి వచ్చాను." తన కోపం మంచులా కరిగిపోయింది.

"ఆవిడెలా ఉన్నారిప్పుడు? ప్రసవించారా?"

"ఇంకాలేదు. డాక్టర్ రమాదేవి, ప్రసవించగానే ఫోన్ చేస్తానన్నారు" అన్నారాయన కుర్చీలో వాలుతూ.

"పదండి, భోజనం చేద్దాం" అంది తను.

అలా ఎన్నోసార్లు ఆయన ఔన్నత్యం ముందు, మంచి తనం ముందు తలవంచింది తను.

కాని, ఈ రోజు - తను జ్వరం వచ్చి పడుంటే ఉదయం తొమ్మిదింటికి వెళ్లినవారు రాత్రి తొమ్మిదయినా అజాపజా లేరు.

తనకూ, ఆయనకూ ఎంతభేదం? తనలో నిండైన ప్రేమ భావం, ఆయనలో పూర్తి అలక్ష్యం!!

ఇన్నాళ్ళ తరువాత, ఇన్ని ఆశాభంగాలూ, ఎదురు దెబ్బలు సహించిం తరువాత ఒక్కసారి వెనక్కు తిరిగి చూచుకుంటే తను తగిన పునాదుల్లేకుండా తన జీవితాన్ని నిర్మించుకుందా అని అనిపిస్తూంది. ఆయనను గౌరవిస్తుంది, ప్రేమిస్తుంది, ఆరాధిస్తుంది. కాని.... తిరిగి నిర్లక్ష్యం లభిస్తూంటే తనలోని ఈ ప్రేమ ఎంతకాలం నిలుస్తుంది? నిరాశ మీద నిరాశ ఎదురవుతూంటే తను ఎంతకాలమని ఈ ప్రేమలతను పచ్చగా ఉంచగలుగుతుంది? ఆయన హృదయం ఎప్పుడో ప్రేమతో స్పందించేసరికి తనలోని ప్రేమ ఇంకి పోతుం

## నర్తకి స్వాతి



కడప గడపలో పుట్టి చిరుత ప్రాయంలోనే అద్భుత నాట్య భంగిమలను ప్రదర్శించి పలువురి ప్రసంశల నందుకుంది–స్వాతి.

బుడి బుడి నడకల స్వాతి బడిలోకెళ్లి 'బలపం' పట్టక ముందే పాదాలు లయబద్ధంగా కదిలేవి. టి.వి.లో వచ్చే నాట్యాలు చూచి, పాటలు విని, పాదాలు కదిలించేది. లయబద్ధంగా, భావాలు భంగిమలు ప్రదర్శించేది. చిన్నారి స్వాతిలోని ఆసక్తిని పసిగట్టిన తల్లిదండ్రులు, శ్రీ నటరాజ పేరిణీ ఆర్ట్స్ అకాడమీ ఆచార్యులు శ్రీ పాలఘాట్ రామాంజనేయులుగారి వద్ద చేర్పించి శాస్త్రీయ నృత్యం అధ్యయనం చేయించారు. అచిర కాలంలోనే కూచిపూడి, భరత నాట్యం–జానపద నృత్య రీతుల నవగాహన చేసుకొని, కృషి చేసి కృత కృత్యురాలయింది.

హైదరాబాదు జవహర్ బాల భవన్ ఆధ్వర్యంలో జరిగిన నాట్య పోటీలలో నృత్యం చేసి ప్రథమ బహుమతినందుకుంది. అంతేకాదు. నెల్లూరు, రాయచోటి, జమ్మలమడుగు, టంగుటూరు, రాజంపేట మొదలైన పట్టణాలలో నృత్య ప్రదర్శనలిచ్చి బహుమతులనందుకుంది.

కడప జాయింట్ కలెక్టర్ డా॥ ఉమామల్లేశ్వర రావు గారి సమక్షంలో ఎన్.ఎస్.ఎస్. సందర్భంగా జరిగిన నాట్య ప్రదర్శనలో స్వాతికి "నాట్య మయూరి" బిరుదు ప్రదానం జరిగింది. కడప కళా క్షేత్రంలో రాయల సీమ స్థాయి సాంస్కృతిక పోటీలలో 'కూచిపూడి'లో ప్రథమ బహుమతిగా రూ. 1116/- నగదు బహుమతినందుకుంది స్వాతి.

ఉత్తర ప్రదేశ్‌లోని "ఈటా నగర్"లో జరిగిన 'యువజనోత్సవాల'లో యేర్పాటు చేసిన నాట్య ప్రదర్శనలో ఉత్తమ నర్తకి అవార్డు నందుకుని ఆంధ్ర ప్రదేశ్‌కే ఖ్యాతి తెచ్చింది స్వాతి.

ప్రస్తుతం కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నదీ చిన్నారి. తల్లి శ్రీమతి ప్రమీలా రాయ్ ప్రముఖ సంఘ సేవకురాలు. తండ్రి దొండపాటి రామిరెడ్డి గారు విద్యాధికులు.

– వి.విజయలక్ష్మి రెడ్డి

---

దేమో! బృంద చెక్కిళ్ళ మీద మంచి ముత్యాల లాంటి కన్నీటి బిందువులు జారాయి.

Vemakoti Seeta Rama Sastry
WRITER
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM.

ఆలోచిస్తే తనలోని అశాంతికి, అల్లిబిల్లిగా పోతున్న పిచ్చి పిచ్చి ఆలోచనలకు మూలకారణం ఆయనకు తనమీద ప్రేమ వున్నట్లు ఆయన చెప్పక పోవడంవల్ల ననిపిస్తుంది. తను మానసికంగా దిగజారిపోతూంది. ఒకవేళ ఆయన ప్రేమతో చూచినా శంకించే స్థితికి వస్తూంది తను. ఆ ఒక్కమాట, ఒక్కసారి ఆయన నోటి నుండి వస్తే తనింత స్వల్ప విషయాలకు బాధపడి వుండేది కాదు.

అసలాయన ఎప్పటికైనా తనను..... కాదు.... అసలెవరినైనా ప్రేమించ గలరా? ఎప్పటికైనా ఆయన తనను ప్రేమించగలిగితే కళ్లల్లో ఆశల్ని నింపుకుని ఆ క్షణం కోసం ఎదురు చూడగలదు తను. కాని.... ఉహు..... ఆయన ప్రేమించలేరు - ప్రేమించలేరు.... ఎవరో తన హృదయాన్ని నొక్కి వేస్తున్నట్లు బాధపడింది బృంద.

"ఎలావుంది బృందా!" వంగి ఆమె నుదుటి మీద చెయ్యి వేసి చూస్తున్నాడు శ్రీకాంత్. ఆమె అతని కంఠంలోని ఆర్ద్రతను, ఆత్మీయతను గుర్తించే స్థితిలో లేదు.

"నేనెలా వుంటే మీకేం?" ఆవేశం, కోపం, బాధ అన్నీ ఒక్కసారి వెళ్లగక్కింది.

"నాకు కాక ఇంకెవరి కుంటుందోయ్?" నవ్వుతూ స్టూల్ ఆమె మంచం దగ్గరకు లాక్కుని కూర్చున్నాడతను.

"ఇంకెవరికన్నా వుండనియ్యండి, వుండనియ్యకపోనీండి. మీకు మాత్రం వుండదు" విసురుగా అంది బృంద.

"చదువుకున్న దానివి. పరిస్థితులను అర్థం చేసుకోగల దానివి. మూర్ఖురాలివేం కాదు" అనునయంగా చెప్పబోయాడు శ్రీకాంత్.

"నేను మూర్ఖురాలినే. కాదని మీతో ఎవరు చెప్పారు. ఎంత మూర్ఖురాలిని కాకపోతే కళ్ల మీద ఆశల పొరలు కప్పుకుని మీరు వద్దు వద్దంటున్నా మొండి పట్టుతో మీ జీవితంలోకి ప్రవేశిస్తాను?" ఆవేశంతో వణికిపోతోంది బృంద.

"నువ్వంతగా ఆవేశపడకు బృందా! స్తిమిత పడి నిద్రపో. నేను అకారణంగా ఆలస్యం చెయ్యలేదు. చావు బ్రతుకుల్లో వున్న ఓ పేషెంట్‌కి అర్జంటుగా ఆపరేషన్ చెయ్యాల్సి వచ్చింది. తోటివాడిని ప్రేమించడం, చేతనైన సాయం చెయ్యటం మన ధర్మం" అన్నాడతను డ్రెస్ మార్చుకుంటూ.

"అవును. తోటివాడిని ప్రేమించడం ధర్మమే. ఒక్క కట్టుకున్న భార్యను ప్రేమించడమే ధర్మం కాదు" ఆమె ఆక్రోశం తారస్థాయి నందుకుంది.

'బృందా! ఏమిటిది? ఏమయిందిరోజు నీకు? నేను నిన్ను ప్రేమించక పోవడమేమిటి?" అన్నాడతను ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని.

"మీరు నన్ను ప్రేమిస్తున్నారా? నిజం చెప్పండి. ఉఁహు. మీరు ప్రేమించలేరు. మీరు ప్రేమించలేరు" వెక్కి వెక్కి ఏడ్చింది బృంద.

ఆమె ఏడ్పు తగ్గేవరకు మౌనంగా ఊరుకున్నాడతను. కన్నీళ్ళు తుడిచి ఆమె తలను ఒడిలో పెట్టుకున్నాడు.

"ఒఠ్ఠి పిచ్చివి. నేను నిన్నెందుకు ప్రేమించను? నేను నోటితో చెప్పనని, డబ్బా కొట్టనని తెలుసుగా నీకు" - మధురంగా నవ్వాడతను. నమ్మలేక, నమ్మకుండా వుండలేక అతనివంక ఆవేదనగా చూచింది బృంద.

"చూడు, ఇటు నా కళ్ళల్లోకి చూడు." వంగి ఆమె కళ్ళను తనవైపుకు తిప్పుకున్నాడు.

"ఈ కనుపాపల్లో ప్రేమ వుందో, మరేమి వుందో చూడు." అతని కళ్ళల్లోకి ఓ క్షణం చూస్తూ వుండిపోయిన బృంద కళ్ళు వింత సంతృప్తితో మెరిశాయి.

"ఇలా నా గుండె దగ్గర చెవి పెట్టి విను." ఆమె చెవి దగ్గర తన గుండెను పెట్టాడు.

"నీకు 'లబ్ డబ్'కు బదులు 'బృందా! బృందా!' అని వినిపించడంలా?" సిగ్గుగా, అందంగా నవ్వుతూ అతని హృదయంలో ముఖాన్ని దాచుకుంది బృంద. "అనురాగమనేది కోమల సుమం బృందా. హృదిలో దాచుకోవాలే గాని ప్రదర్శించాలనే తపన వుండకూడదు. అలా ప్రదర్శించినప్పుడు దానిలో లాలిత్యం వుండదు. ఓ ప్రత్యేకతా వుండదు. కాదూ?" - ఆమె ముంగురులతో ఆడుకుంటున్నాడతను. జవాబుగా అతని చేతుల్ని తన కళ్ళ మీద వుంచుకుని నవ్వింది బృంద, హిమబిందు స్పర్శతో విచ్చుకున్న పారిజాతంలా.